..కేసీఆర్ పేరే రాలే

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. సంబంధిత వాంగ్మూల పత్రాన్ని మోహిత్‌రావు విడుదల చేశారు. కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా బురద చల్లేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే తాను ప్రత్యేకంగా ప్రకటన విడుదల చేస్తున్నాని తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డి పేరును కేసీఆర్‌కు అన్వయించారు

ఈడీ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ నిరుడు జూలై 26, 27 తేదీల్లో మాగుంట రాఘవ ఇచ్చిన వాంగ్మూలాన్ని ప్రస్తావించారని మోహిత్‌రావు గుర్తుచేశారు. ఇందులో 'ఎమ్మెల్సీ కవిత, తన తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి మధ్య జరిగిన ఒప్పందం మేరకు అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు అనే వ్యక్తులకు రూ.25 కోట్ల నగదు ఇచ్చినట్టు రాఘవ చెప్పారు. ఇందులో రూ.10 కోట్ల నగదును 2021 మార్చి 28న బుచ్చిబాబు ఇచ్చిన చెన్నైలోని ఓ అడ్రస్‌లో, మరో రూ.15 కోట్లను 2021 జూన్‌లో అభిషేక్ బోయినపల్లి ఇచ్చిన ఓ అడ్రస్‌లో రాఘవ ప్రతినిధి గోపీ కుమారన్ అందజేశారు. ఆయన ఇచ్చిన వాంగ్మూలం కూడా దీనితో సరిపోలింది. తర్వాత కవిత తన టీమ్ సభ్యులు బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, అరుణ్‌పిళ్లైని ఆయన (మాగుంట రాఘవ) తండ్రి (మాగుంట శ్రీనివాసులురెడ్డి)కి పరిచయం చేశారని, వాళ్లు ఢిల్లీలోని తన తండ్రి ఇంటిలో కలుసుకున్నారని రాఘవ చెప్పారు. తర్వాత సమీర్ మహేంద్రు అనే వ్యక్తిని బుచ్చిబాబు ఆయనకు, ఆయన తండ్రికి పరిచయం చేశారని, తాము రిటెయిల్ బిజినెస్‌లో పార్ట్నర్‌షిప్‌పై చర్చలు జరిపామని చెప్పారు' అని మాత్రమే వాంగ్మూలంలో ఉన్నదని తెలిపారు. ఈ వాంగ్మూలంలో ఎక్కడా కూడా కేసీఆర్ పేరే లేదని.. ఎమ్మెల్సీ కవిత నిందితులందరినీ 'ఆమె' తండ్రికి పరిచయం చేశారని, ఢిల్లీలోని 'ఆమె' తండ్రి నివాసంలో కలుసుకున్నారని చెప్పలేదని మోహిత్‌రావు స్పష్టం చేశారు. ఈడీ తరఫు న్యాయవాదులు శ్రీనివాసులురెడ్డి గురించి ప్రస్తావిస్తే, దానిని ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌కు అన్వయించారని విమర్శించారు.

వెంటనే అసత్య ప్రసారాలు ఆపండి

ఈ కేసులో మీడియా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. వాస్తవాలను పరిశీలించకుండా, నిరాధార కథనాలు ప్రసారం చేయొద్దని, ప్రచురించవద్దని పేర్కొన్నారు. శ్రీనివాసులురెడ్డి ప్రస్తావనను కేసీఆర్‌కు అన్వయించిన ఆయా చానళ్లు వెంటనే ఆ కథనాలను నిలిపివేయాలని, నిరాధార, అసత్య కథనాలను ప్రచురిస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే హక్కు తన క్లయిం ట్ కవితకు ఉన్నదని మోహిత్‌రావు స్పష్టం చేశారు.

మంత్రి కోమటిరెడ్డి ఆఫీసు ఎదుట ఆందోళన

నష్టపరిహారం చెల్లించాలని రింగ్‌రోడ్ బాధితుల డిమాండ్

నల్లగొండ సిటీ, మే 28 : నల్లగొండ పట్టణం చుట్టూ నిర్మించే రింగ్‌రోడ్డులో భూములు, ఇండ్లు కోల్పోతున్న పలువురు బాధితులు నష్టపరిహారం చెల్లించాలని మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రైతుల పొలాల్లో నుంచి రోడ్డు నిర్మాణానికి తాత్కాలిక మార్క్ చేయడంతోపాటు నల్లగొండ మండలం కత్తాల్‌గూడ వద్ద వంతెన నిర్మాణ ప్రాంతంలో మట్టి నమూనా కోసం చేసే డ్రిల్లింగ్ యంత్రాలను సోమవారం అడ్డుకున్నారు.

జూపల్లికి మాటల కొరత

మొన్న రాష్ట్రంలో మద్యం కొరత లేనే లేదన్నారు. ఇప్పుడు కొరత ఉన్నందునే కొత్త కంపెనీలకు గేట్లెత్తామని చెప్పారు. కొత్త బ్రాండ్లు వస్తున్నాయన్నది తప్పుడు ప్రచారమేనని మొదట అన్నారు. డిమాండ్ మేరకే కొత్త మద్యం బ్రాండ్లు తెస్తున్నామని ప్రకటించారు.మొన్న కొత్త కంపెనీల నుంచి తమకు దరఖాస్తులేవీ రాలేవన్నారు. ఇప్పుడు పర్మిషన్ ఇచ్చింది బేవరేజెస్ కార్పొరేషనే తప్ప తాను కాదన్నారు..

ఇదీ ఎక్సైజ్ మంత్రి జూపల్లి మాటమార్చిన తీరు!

కొత్త మద్యం కంపెనీల నుంచి దరఖాస్తులేవీ రాలేదని ప్రకటించిన మంత్రి.. వారం తిరక్కముందే తన ప్రకటనలపై తానే మాట మార్చారు. దరఖాస్తులు వచ్చాయేమో, బేవరేజెస్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకున్నదేమోనంటూ నీళ్లు నమిలారు. 'సోం' డిస్టిలరీ వాలా పేరున్న కంపెనీ అంటూ.. దానిని వెనకేసుకువచ్చే ప్రయత్నం చేశారు.

- మద్యం అనుమతులపై మాటమార్చిన ఎక్సైజ్ మంత్రి
- రాష్ట్రంలో మద్యం కొరత.. అందుకే కొత్తవాటికి పర్మిషన్
- 'సోం'బీర్‌కు పర్మిషన్ ఇచ్చింది బేవరేజెస్ కార్పొరేషన్
- నాకు దరఖాస్తులు రాలేదు..ఆ మాటకే కట్టుబడి ఉన్నా
- వాస్తవాలు తెలియకుండా వార్తలు రాయొద్దు: జూపల్లి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ నియమ నిబంధనల మేరకే సోం డిస్టిలరీస్‌తోపాటు మరి కొన్ని కంపెనీలకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చిందని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త మద్యం బ్రాండ్లకు సంబంధించి తమ వద్దకు ఎటువంటి దరఖాస్తులు రాలేదని గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని మంత్రి పేర్కొన్నారు. కొత్త మద్యం కంపెనీలకు అనుమతుల ఫైల్ తన వద్దకు రాలేదని, నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకునే అధికారం బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఉన్నదని తెలిపారు. ఆ మేరకే సోం డిస్టిలరీస్‌కు అనుమతినిచ్చారని మంత్రి వెల్లడించారు. బేవరేజెస్ కార్పొరేషన్ రోజువారీ కార్యకలాపాలు తమ దృష్టికి రావని, వాస్తవాలను తెలుసుకోకుండానే కొన్ని పత్రికలు అసత్య వార్తలను ప్రచురించాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో హోల్‌సేల్ మద్యం సరఫరాకు కొత్త బ్రాండ్లకు అనుమతులిచ్చే ప్రక్రియ తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో ఉంటుందని, డిమాండ్-సప్లయ్‌ను బట్టి కొత్త కంపనీలకు అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా సోం డిస్టిలరీస్ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నదని, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఐఎంఎఫ్‌ఎల్ సరఫరాదారుగా ఉన్నదని తెలిపారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా అనుమతిలిచ్చింది

బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో నాలుగు సంవత్సరాల క్రితం కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చిన విషయాన్ని మంత్రి తన ప్రకటనలో గుర్తు చేశారు. 2020-2021 సంవత్సరంలో 50 లిక్కర్ బ్రాండ్లు, 5 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2021-2022లో 75 లిక్కర్, 8 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2022-2023లో 122 లిక్కర్, 11 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2023-2024లో 41 లిక్కర్, 9 బీర్ బ్రాండ్ల కంపెనీలకు అనుమతులు ఇచ్చిందని తెలిపారు. గతంలో అనుసరించిన విధానం ప్రకారమే తాము అప్రూవల్ ఇచ్చామని.. దురుద్దేశపూర్వకంగా కొన్ని వార్త పత్రికలు తప్పుడు వార్తలను ప్రచురించాయని ఆరోపించారు. మొత్తం ఐఎంఎఫ్‌ఎల్/బీర్ల తయారీ, సప్లయ్ చైన్ 97.44శాతం విదేశీ కంపెనీలే ఆక్రమించాయని పేర్కొన్నారు. మన దేశానికే చెందిన సోం డిస్టిలరీకి మద్యం సరఫరాకు అనుమతులు ఇయ్యడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అసంబద్ధమైన దుష్ప్రచారాలను మానుకోవాలని కోరారు.

కమీషన్లు కుదిరితే.. త్వరలో కొత్త బ్రాండ్లు

- జూన్ 8 తర్వాత మరిన్ని కొత్త మద్యం రకాలు వచ్చే అవకాశం
- కొత్త కంపెనీలు, ప్రభుత్వం మధ్య జోరుగా లాబీయింగ్
- 10 నుంచి 20 శాతం కమీషన్‌కు కొత్త కంపెనీలు సై
- అధికార పార్టీ ముఖ్యనేత తమ్ముడిదే కీలక పాత్ర

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చేనెలలో మరిన్ని కొత్త మద్యం బ్రాండ్‌లు అందుబాటులోకి రానున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెల 8వ తేదీ తరువాత కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశమున్నదని మద్యం వ్యాపారవర్గాలు చెప్తున్నారు. ఇటీవల 'సోం డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ కంపెనీ తెలంగాణలో అడుగుపెట్టగా.. అదేబాటలో మరికొన్ని కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టనున్నట్టు తెలిసింది. రెండు నెలలుగా రాష్ట్రంలో కొన్ని నిర్ణీత బ్రాండ్లకు సంబంధించిన బీర్లు, ఇతర మద్యం రకాలు దొరకడంలేదు. మద్యం ప్రియులు కోరుకొనే ప్రముఖ బ్రాండ్లకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఇండెంట్‌ను పెట్టలేకపోతున్నది. ఉదాహరణకు 15 కార్టన్లను సప్లయ్ చేయాల్సిన చోట.. రేషన్ పద్ధతి విధించి 3 నుంచి 5 కార్టన్ల వరకే మద్యం షాపులకు అందిస్తున్నారు. తయారీ కంపెనీల వద్ద కావాల్సినంత స్టాక్ ఉన్నప్పటికీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఇండెంట్ పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మద్యం అమ్మకందారులు ఆరోపిస్తున్నారు. డిమాండ్ బ్రాండ్ల వినియోగాన్ని ఓ క్రమపద్ధతిలో తగ్గించనున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. పాత బ్రాండ్లకు పాతరేస్తారేమోనని చర్చ జరుగుతున్నది. కొత్త మద్యాన్ని అలవాటు చేసుకోవడానికి ఎంత సమయం పడుతుంది? ఎంతమేరకు అవి ప్రజల్లోకి వెళ్తాయనే సందేహం వ్యాపారవర్గాల్లో నెలకొన్నది.

10 నుంచి 20 శాతం కమీషన్?

కొన్ని కొత్త మద్యం కంపెనీలు తెలంగాణలో తమ బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. ఇందుకోసం తమ ప్రతినిధుల ద్వారా ప్రభుత్వ పెద్దలతో లాబీయింగ్ చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో కంపెనీల నుంచి భారీగా కమీషన్ డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. ఒక్కో బాటిల్‌పై 10 నుంచి 20 శాతం వరకు కమీషన్ డిమాండ్ చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడున్న మార్కెట్ ధరతో పోలిస్తే కంపెనీలకు ఒక్కో బాటిల్ తయారీకి ఆ 10 నుంచి 20 శాతం ఖర్చే అవుతుండటంతో కమీషన్ చెల్లించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు చెప్తున్నారు. ఇవన్నీ సక్రమంగా జరిగితే జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో కొత్త బ్రాండ్లు మార్కెట్లోకి విడుదలయ్యే అవకాశమున్నది. అయితే ఈ వ్యవహారమంతటిలో అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత తమ్ముడు కీలకపాత్ర పోషిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. మొత్తం అతని కనుసన్నల్లోనే నడుస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు, అనుమతుల ప్రక్రియ అంతా పారదర్శకంగానే ఉన్నా.. ఆ కమీషన్‌ను డీల్ చేసేది మాత్రం ఆ తమ్ముడేనని మద్యం వ్యాపారులు చెబుతున్నారు.

కల్తీ మద్యం వస్తుందేమోనని భయం..

తెలంగాణలో వచ్చే కొత్త బ్రాండ్ల మద్యం ప్రజలకు ఏ మేరకు అలవాటువుతుందనే సంశయం మద్యం వ్యాపారవర్గాల్లో నెలకొంది. కొత్త బ్రాండ్ పేరుతో కల్తీ మద్యం వస్తుందేమోనన్న ఆందోళన అటు మద్యం ప్రియుల్లోనూ వ్యక్తమవుతున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా నాణ్యమైన మద్యాన్ని విక్రయించిందని వినియోగదారులు చెప్తున్నారు. ఏదైనా బ్రాండ్ మీద వ్యతిరేకత వస్తే.. దానిని మద్యం ప్రియుల్లోకి ఎలా తీసుకెళ్లాలో అనే ప్రణాళికలు సైతం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. కొత్త కంపెనీలు, కొత్త బ్రాండ్లు వస్తే తమకు కూడా కమీషన్ వచ్చే అవకాశం ఉండటంతో కొందరు ప్రభుత్వ పెద్దలే కావాలని మద్యం కృత్రిమ కొరతకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొత్త కంపెనీలను బూచిగా చూపించి పాత కంపెనీలను కూడా దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం జరుగుతున్నట్టు వ్యాపారవర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

కవితకు బెయిల్‌పై రేపు తీర్పు?

ఢిల్లీ హైకోర్టులో ముగిసిన వాదనలు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇచ్చే విషయమై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఇరు పక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు గురువారం వెలువడే అవకాశమున్నట్టు తెలిసింది. కవిత తరఫు న్యాయవాది నితీశ్ రాణే వాదనలు వినిపిస్తూ ఎటువంటి కారణాలు చూపించకుండానే సీబీఐ కవితను అరెస్టు చేసిందని అన్నారు. కవిత సాక్ష్యాలను ధ్వంసం చేసిందనడం సరికాదని, తాను వాడిన ఫోన్లను తన అవసరం తీరిన తర్వాత సహాయకులకు ఇచ్చారని తెలిపారు. ఈడీ అధికారులు ఆ ఫోన్లను ఇవ్వాలని కోరిన వెంటనే ఆమె సహాయకులు ఫార్మాట్ చేసి ఇచ్చారని, కవిత వాటినే ఈడీ అధికారులకు కూడా అందజేశారని చెప్పారు. ఇందులో సాక్ష్యాలను ధ్వంసం చేయడమన్నదే లేదని స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లు 42శాతానికి పెంచాల్సిందే

మంత్రి సీతక్కతో ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ):పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20నుంచి 42శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయఅధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కతో ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘం నేతలు చర్చలు జరిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 45శాతం ప్రాతినిధ్యం కల్పించారని, జనరల్ స్థానాల్లో కూడా బీసీ జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీపీ, చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు ఇస్తుంటే.. ఇక్కడ ఎన్నికల వాగ్దానం మేరకు రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేయడం సరికాదని ఆర్.కృష్ణయ్య వాపోయారు.

కాంగ్రెస్ డైవర్షన్ డ్రామా?

- మద్యం బ్రాండ్లపై దొరికిన ప్రభుత్వం
- 'ధాన్యం' టెండర్ల స్కాంతో ఉక్కిరిబిక్కిరి
- విత్తనాలు అడిగిన రైతులపై లాఠీచార్జి
- సంక్షోభం అంచున వ్యవసాయం
- ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎత్తుగడ
- ఫోన్ ట్యాపింగ్, ఢిల్లీ మద్యం విధానం కేసుల్లో కేసీఆర్ పేరు అంటూ ప్రచారం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వమే 'డైవర్షన్ డ్రామా' ఆడుతున్నదని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.'ఫోన్ ట్యాపింగ్ లీక్స్'అస్త్రాన్ని తెరమీదికి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేస్తూ ప్రజలకు అడ్డంగా దొరికిపోతున్నది. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'డైవర్షన్ డ్రామా' చేయడం అలవాటుగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరుసగా మూడు నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తమ అనుకూల మీడియా ద్వారా కేసీఆర్‌పై విష ప్రచారం చేస్తున్నాయని చెప్తున్నారు.

కాదంటే అవుననిలే

రాష్ట్రంలో కొత్త బ్రాండ్ల మద్యం రాబోతున్నదని నమస్తే తెలంగాణ వెలుగులోకి తెచ్చింది. వెంటనే మంత్రి జూపల్లి ప్రెస్‌మీట్ పెట్టి మరీ కొత్త కంపెనీలకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. పైగా పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు. రెండు రోజులకే తాము తెలంగాణలో అడుగుపెడుతున్నామని వివాదాస్పద కంపెనీ సోం డిస్టిలరీస్ సోమవారం ప్రకటించింది. నిబంధనల మేరకే అనుమతులు ఇచ్చామని మంత్రి జూపల్లి సైతం ఒప్పుకున్నారు. పౌరసరఫరాలశాఖ నిర్వహించిన సన్న బియ్యం కొనుగోలు, ధాన్యం అమ్మకాల టెండర్లలో రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి కేటీఆర్ స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు బహిర్గతం చేశారు. వెంటనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టిమరీ దీనిని ఖండించారు. తర్వాత రెండు రోజులకే ధాన్యం కొనుగోలు టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. మంత్రి స్వయంగా ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యవసాయ రంగంలో 2014 నాటి పరిస్థితులు వస్తాయని కేసీఆర్ పదే పదే హెచ్చరించారు. చెప్పినట్టే ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పోలీసు పహారాలో విత్తనాల పంపిణీ జరుగుతున్నది. లైన్లలో చెప్పులు, పాస్ పుస్తకాలు కనిపిస్తున్నాయి. వనపర్తి జిల్లాలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యకు గురయ్యారు. ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై సోమవారం బీఆర్‌ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు.

బయటికి ఎలా తెలిసింది?

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తాజా విచారణలో కేసీఆర్ పేరును బయటపెట్టారని మంగళవారం వార్తలు వచ్చాయి. దీనిపై బీఆర్‌ఎస్ నేతలు మండిపడుతున్నారు. 'మాజీ డీసీపీ రాధాకిషన్ చంచల్‌గూడ జైలులోని కృష్ణా బ్లాక్ బ్యారక్ నంబర్ 17లో ఉన్నారు. ప్రస్తుతం ఆయనను కలవడానికి ఎవరినీ అనుమతించడం లేదు. కొన్ని వారాలుగా ఆయన పోలీస్ కస్టడీలో కూడా లేరు. మరి ఒక్కసారిగా డీసీపీ చెప్పారంటూ మీడియాకు లీకులు ఎలా వచ్చాయి? ఏదైనా వీడియో ఆధారం ఉందా? ఎవరైనా విచారణ అధికారి ఆయనను కలిశారా? లేదా జైలు నుంచి ఆయన ఏమైనా లేఖ గానీ, ప్రెస్ రిలీజ్ గానీ ఇచ్చారా?' అని బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ధాన్యం కుంభకోణాన్ని, లిక్కర్ కుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయటపెట్టిందని, బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యలో న్యాయం చేయాలని పోరాడుతున్నదని గుర్తు చేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే అటెన్షన్ డైవర్షన్ డ్రామా మొదలు పెట్టిందని విమర్శించారు.

ప్రస్తావనే లేకున్నా కేసీఆర్‌పై దుష్ప్రచారం

ఢిల్లీ మద్యం విధానంలో ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై మంగళవారం ఢిల్లీ కోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ఈడీ న్యాయవాదులు కేసీఆర్ పేరును ప్రస్తావించారంటూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. అసలు ఈడీ వాదనల్లో ఎక్కడా కేసీఆర్ పేరును ప్రస్తావించలేదని,వాంగ్మూల పత్రంలోనూ కేసీఆర్ పేరే లేదని కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు స్పష్టం చేశారు. కావాలనే కొందరు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

వాళ్లకే ఎలా తెలిసింది?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధానంగా ఒక టీవీ చానల్‌లోనే లీకులు వస్తున్నాయని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలపైనా ముందస్తుగా సమాచారాన్ని ఇస్తున్నారని చెప్తున్నారు. ఆ చానల్‌లో కాంగ్రెస్ నేతలకు పెట్టుబడులు ఉండటమే కారణమని స్పష్టం చేస్తున్నారు. దీంతోపాటు అధికారపార్టీలోని నేతకు చెందిన మీడియా ద్వారా తప్పుడు కథనాలు ప్రచురిస్తూ, ప్రభుత్వ అనుకూల మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడుతున్నారు.

రాష్ట్రంలో దేనిపై చర్చ జరగాలి?

'' ఆదిలాబాద్‌లో మంగళవారం రైతులు విత్తనాల కోసం వెళ్తే లాఠీచార్జి జరిగింది. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందనే చర్చ జరగాలి. నిబంధనల మేరకే సోం డిస్టిలరీస్ బ్రాండ్ మద్యం అమ్మకాలకు అనుమతినిచ్చామని మంత్రి జూపల్లి మంగళవారం ప్రకటించారు. నాలుగైదు రోజుల్లోనే ఎలా మాట మార్చారో చర్చ జరగాలి. సన్నబియ్యం కొనుగోలు టెండర్లను రద్దు చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అంటే కుంభకోణం జరిగిందని ఒప్పుకుంటున్నారా? అనే కోణంలో చర్చ జరగాలి. వనపర్తిలో శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో ఒక్కరినీ అరెస్ట్ చేయలేదు. సీఎం, మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలో ఒక రాజకీయ నేత హత్య జరిగి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదనే కోణంలో చర్చ జరగాలి. కానీ ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ప్రభుత్వ అనుకూల మీడియా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ఎత్తుకున్నది. కేసీఆర్ కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందని నిందితులు అంగీకరించారని, ఢిల్లీ మద్యం విధానంలోనూ కేసీఆర్ పేరును ఈడీ ప్రస్తావించిందని ఊదరగొడుతున్నది'' అని సీనియర్ రాజకీయవేత్తలు, సీనియర్ పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లీకులతో కనికట్టు..

- రాష్ట్రంలో పెరుగుతున్న సమస్యలు
- అన్ని రంగాల్లోనూ సర్కారు విఫలం
- ఫోన్ ట్యాపింగ్ డ్రామాతో కనికట్టు
- పోలీసులు పట్టుకున్నది హవాలా సొమ్మే
- దానినే నేరంగా చూపే యత్నం
- ఈసీ ఆధీనంలో జరిగిన ఘటనలు కేసీఆర్ ప్రభుత్వానికి రుద్దే యత్నం
- 24 కోట్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): నిత్యం కరెంటు కోతలు, రాష్ట్రమంతా తాగు, సాగునీటి వెతలు. ఒకవైపు ధాన్యాన్ని కొనేవారు కరువు.. ఇంకోవైపు నాటేందుకు విత్తనాలు కావాలంటే రైతులపై పోలీసు లాఠీల దరువు. తెలంగాణ తాజా ముఖచిత్రమిది. ఐదు నెలల్లోనే ఘనత వహించిన రేవంత్ సర్కారు పాలనా తీరిది. రాష్ట్రంలోని ఏ మూలన ఉన్న సామాన్య పౌరుడిని అడిగినా చెప్పే సత్యాలివి. మరి, వీటన్నింటి నుంచి ప్రజల దృష్టిని మరల్చాలంటే ఏం చేయాలి? లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు కనికట్టు కట్టాలి. అనుకూల మీడియాలో రోజుకో లీకుతో సరికొత్త కథనం వండి వార్చాలి. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది కూడా ఇదే. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డైలీ సీరియల్‌ను ప్రభుత్వం ప్రజల మీదకు విసురుతున్నది.

హవాలా సొమ్మును పట్టుకుంటే నేరమా?

ఫోన్ ట్యాపింగ్‌తో ముడిపెట్టి కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2018, 2022లో జరిగిన ఉప ఎన్నికలు, 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల సమయాల్లో 17 చోట్ల హవాలా సొమ్మును పోలీసులు సీజ్ చేశారు. ఇది ఫోన్ ట్యాపింగ్ ద్వారానే సాధ్యమైందని నిందితులు అంగీకరించినట్టుగా చెప్తున్నారు. కానీ అదేదో కేసీఆర్ ప్రభుత్వమే పనిగట్టుకొని చేసినట్టుగా ప్రచారం చేయడమే దుర్మార్గమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత అధికార యంత్రాంగం పూర్తిగా ఎన్నికల కమిషన్ ఆధీనంలోకి వెళ్తుంది. కాబట్టి ఈసీ ఆధీనంలోని పోలీసు యంత్రాంగం ఫోన్ ట్యాపింగ్ ద్వారా హవాలా సొమ్మును పట్టుకోవడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా రహస్యంగా సమాచారాన్ని సేకరించేందుకు పలు మార్గాలను ఎంచుకుంటారు. ఇందులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ ద్వారా సమాచారాన్ని సేకరించి రూ. 24 కోట్ల హవాలా సొమ్మును పట్టుకుని ఉండవచ్చని చెప్తున్నారు. ఎన్నికల సమయంలో ఇంత పెద్ద ఎత్తున డబ్బును ఎరవేసి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలిస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించకుండా హవాలా సొమ్మును పట్టుకోవడమనేది ప్రజాస్వామ్యానికి మంచి చేయడమే అవుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇక్కడ కేవలం ప్రతిపక్ష పార్టీల డబ్బులను మాత్రమే పట్టుకున్నారని, అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ డబ్బులను పట్టుకోలేదనే వింత వాదన తెరపైకి తెస్తున్నారు. అంటే ప్రతిపక్ష పార్టీలు ఆయా ఎన్నికల సందర్భాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇంత పెద్ద మొత్తాన్ని తరలించాయనేది వాస్తవమని బట్టబయలైంది. 'అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ డబ్బులు తరలించిందనేందుకు రుజువులు లేవు. తరలించి ఉండకపోవచ్చు' అనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకొని, వాటిపై ప్రజల్లో చర్చ జరగకుండా ఉండేందుకు ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలించే హవాలా సొమ్మును పట్టుకోవడాన్ని కూడా తప్పుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తుండటమే సరికొత్త వింతగా ఉందని రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

నిందితుల వాంగ్మూలంలో చెప్పినవి..

ఎన్నికల వేళ అక్రమ నగదు రవాణాను కట్టడి చేయడంలో భాగంగా టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ, స్థానిక పోలీసుల సహకారంతో 2023, అంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా పట్టుబడ్డ సొమ్ము వివరాలను అరెస్ట్ అయిన నిందితులు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

నగదు సంబంధీకులు	నగదు వివరాలు (రూ. లో)
గాలి అనిల్‌కుమార్(రేవంత్‌రెడ్డి సన్నిహితుడు)	90,00,000
కే వినయ్‌రెడ్డి, ఇతరులు(రేవంత్‌రెడ్డి సన్నిహితుడు)	1,99,85,000
రాఘవ ఇన్‌ఫ్రా (పొంగులేటి సుధాకర్‌రెడ్డి)	7,50,00,000
రాఘవ ఇన్‌ఫ్రా (పొంగులేటి సుధాకర్ రెడ్డి)	3,00,00,000
చొప్పరి వేణు (రాజగోపాల్‌రెడ్డి)	1,00,00,000
మధు, శ్రీహరి(రాజగోపాల్‌రెడ్డి)	1,18,00,000
మధు, శ్రీహరి(రాజగోపాల్‌రెడ్డి)	42,66,500
కందుల రవికిషోర్(విశాఖ ఇండస్ట్రీస్)	50,45,000
గిరిధర్‌రెడ్డి (ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నిహితుడు)	35,00,000
ఝాన్సీరెడ్డి	40,00,000
బీబీఆర్ హాస్పిటల్(ఝాన్సీరెడ్డి)	50,00,000
జడ్చర్ల నియోజకవర్గం	20,00,000
నార్సింగి పీఎస్	70,00,000
పెస్టిసైడ్ ఓనర్(పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలిసిన వ్యక్తి)	10,00,000

ఉప ఎన్నికల సందర్భంగా పట్టుబడిన నగదు వివరాలు

శేరిలింగంపల్లి టీడీపీ అభ్యర్థికి చెందిన (భవ్య సిమెంట్)	70,00,000
బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు (సిద్దిపేటలోని చిట్‌ఫండ్ కంపెనీ) చెందినవి	1,00,00,000
మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి చెందిన కోమటిరెడ్డి రాజాగోపాల్‌రెడ్డి	3,50,00,000
మొత్తం	23,95,96,500

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోరా?

పోలీసుల తీరుకు నిరసనగా బీజేపీ, ఎమ్మార్పీఎస్ ధర్నా

నాగర్‌కర్నూల్, మే 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదైనా అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13న చిన్నకారుపాములలో ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ వర్గీయులైన మైసమ్మ, చైర్మన్ శ్రీనివాసులుతోపాటు పది మంది దాడి చేశారని తెలిపారు. వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొళ్ల శివ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కొల్లాపూర్ సీఐ మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. డీఎస్పీతో మాట్లాడి అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.